


రిజర్వాయర్‌లోకి చేరుకున్న గోదావరి జలాలు

తపాస్‌పల్లికి జలకళ

కొమురవెల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : అయినాపూర్ శివారులోని తపాస్‌పల్లి రిజర్వాయర్ జలకళను సంతరించుకున్నది. ఫేజ్-2, ఫేజ్-3 పంపుల ద్వారా గోదావరి జలాలను రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేస్తున్నారు. 540 మీటర్ల ఎత్తులో ఉన్న రిజర్వాయర్‌లోకి గోదావరమ్మ తరలివచ్చింది. దీంతో జలాశయంలో నీటిమట్టం పూర్తిస్థాయి సామర్థ్యానికి చేరుకున్నది. రిజర్వాయర్ కళకళలాడుతుండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రిజర్వాయర్ ఆయకట్టు కింద కొమురవెల్లి, చేర్యాల, మద్దూరు, ధూళిమిట్ట, బచ్చన్నపేట, కొండపాక మండలాల్లోని ఆయా గ్రామాల చెరువుల్లోకి కాలువల ద్వారా నీటిని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నాలుగు రోజుల క్రితం విడుదల చేశారు. ఆయా మండలాల్లోని 32 చెరువులను గోదావరి జలాలతో నింపనున్నారు. చెరువుల ద్వారా ఆయకట్టు పంటలకు నీళ్లు అందనున్నాయి. కేవలం వర్షాకాలంలోనే చెరువులను నింపడం కాకుండా ప్రజాప్రతినిధులు,అధికారులు చొరవ చూపి రాబోయే రబీ సీజన్‌కు సైతం చెరువులను నింపి పంటలకు నీళ్లు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.


కాలువ ద్వారా చెరువులకు తరలుతున్న నీళ్లు


కొడుకును దగ్గరకు తీసుకుని ఏడుస్తున్న తల్లి వరవ్వ

కలోగంజో కలిసి తాగుతూ ఇక్కడే ఉందాం

- బిడ్డను పట్టుకుని కన్నీటిపర్యంతమైన తల్లి
- కిర్గిస్తాన్ నుంచి ఇంటికి చేరిన బాధితుడు

దుబ్బాక, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): 'బిడ్డా.. నీవెక్కడికి పోవద్దు. కలోగంజో కలిసి తాగుతూ ఇక్కడే ఉందాం' అని కన్నీటిపర్యంతమయ్యారు దుబ్బాక మండలం బల్వంతాపూర్ గ్రామానికి చెందిన సౌడ రజనీకాంత్ తల్లి వరవ్వ. కడుపు చూసేవారు లేని దేశంలో ఉండటం కంటే, డబ్బులు లేకపోయినా కలిసి ఉండటమే ముఖ్యమని ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. పని నిమిత్తం కిర్గిస్తాన్ వెళ్లి బందీగా ఉండి విడుదలైన రజనీకాంత్ ఆదివారం తన స్వగ్రామం చేరుకున్నారు. ఈ సందర్భంగా కుమారుడిని చూసి ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. 'నన్ను వదిలి ఎక్కడికీ పోవద్దు. డబ్బులు పోయినా పర్లేదు. బతుకుంటే మళ్లీ సంపాదించుకోవచ్చు. పుస్తెల తాడు అమ్మి నిన్ను తిరిగి తెచ్చుకున్నాను. మళ్లీ బతికినట్టయింది' అని ఆమె కుమారుడిని హత్తుకుని అన్నారు. కంపెనీకి లక్ష రూపాయలు చెల్లించగానే తన పాస్‌పోర్ట్ ఇచ్చారని, తినడానికి అనుమతించారని రజనీకాంత్ తెలిపారు. అక్కడి నుంచి కిర్గిస్తాన్ చేరుకుని మస్కట్ ఫ్లైట్ ఎక్కి, ఆ తర్వాత భారత్‌కు చేరుకున్నానని, హైదరాబాద్‌లో దిగి బస్ ఎక్కగానే ప్రాణం తిరిగి వచ్చినట్టు అనిపించిందని రజనీకాంత్ తెలిపారు. తాను సుమారు మూడు లక్షలు నష్టపోయానని, అయితే తిరిగి తన తల్లిని, భార్య, పిల్లలను చూస్తానని అనుకోలేదని వాపోయాడు. తిండిలేక పస్తులు ఉన్న సమయంలో, దుబ్బాక విలేకరులు రాసిన కథనాలతోనే తాను ధైర్యం తెచ్చుకుని బతికి బయటపడ్డానని రజనీకాంత్ 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.


టమాట ధర వింటేనే మంట పుడుతోంది.. మార్కెట్‌కు వెళ్లినవారు క్యారెట్‌ను చూసి "క్యా రేట్ హై" అంటున్నారు.. కాకరకాయ కొరకొరమంటోంది.. లేలేత బెండకాయలు కొనాలంటే జేబుకు చిల్లు పడుతోంది.. పచ్చిమిర్చి రేటు అయితే ఘాటెక్కిస్తున్నది.! ఏ కూరగాయ ముట్టుకున్నా సామాన్యులకు సెగ తగులుతోంది. రూ.500 పట్టుకెళితే వారానికి సరిపడా కూరగాయలు రావడం లేదు. భగ్గుమంటున్న రేట్లు పేద, మధ్య తరగతి ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి.

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

మాట వినని టమాట.. ఘాటెక్కిస్తున్న పచ్చిమిర్చి

అదే బాటలో బెండకాయ, కాకర, బీర్నీస్

సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం



కూరోమొర్రో


సిద్దిపేట పట్టణంలోని రైతుబజార్‌లో కూరగాయలు కొంటున్న ప్రజలు

సిద్దిపేట ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : రోజురోజుకు పెరుగుతున్న కూరగాయల ధరలతో పేద, సామాన్య ప్రజలు బెంబెలెత్తుతున్నారు. కొన్ని నెలల క్రితం రూ.200 తీసుకుని రైతుబజార్‌కు వెళ్తే సంచి నిండా కూరగాయలు వచ్చి వారానికి సరిపోయేవి. ప్రస్తుతం రూ.500 వెచ్చించినా సంచిలో సగం కూడా రాని పరిస్థితి నెలకొంది. కొద్ది రోజుల నుంచి టమాట, పచ్చిమిర్చి, బెండకాయ, బీరకాయ, బీర్నిస్ గోరుచిక్కుడు, పాపిడి చిక్కుడు లాంటి కూరగాయలు సెంచరీ కొట్టేందుకు తహతహలాడుతున్నాయి. ఇక ఆకుకూరల ధరలు అమాతంగా పెరిగిపోయాయి. భగ్గుమంటున్న ధరలు సామాన్య, మధ్యతరగతి ప్రజలను భయపెడుతున్నాయి.

పెరుగుదలలో పోటీపడుతున్న కూరగాయలు

వంటింట్లో అన్ని కూరల్లో వాటా పంచుకునే టమాట రైతుబజార్‌లో కిలో రూ.40 పలుకుతోంది. బహిరంగ మార్కెట్లు, వీధి వ్యాపారులైతే రూ.75-80కి అమ్ముతున్నారు. ఆ టమాట కూడా పుచ్చులు, మరకలుగా ఉన్న టమాటే రైతుబజార్‌లో అమ్ముడుపోయింది. దానికి తోడు నేనేం తక్కువ కాదంటూ పచ్చిమిర్చి సైతం రూ.80 వరకు పలికింది. ఇక బీర్నిస్ మాత్రం రూ.80 నుంచి తగ్గడం లేదు. ఒకప్పుడు రూ.20కి 8 పాలకూర కట్టలు ఇవ్వగా, ఇప్పుడు రూ.50కి నాలుగే కట్టలు ఇస్తున్నారు. మెంతి, కొత్తిమీర ధరలు

మిగతా 8వ పేజీలో

ధరలు ఇలా.. (కిలో రూ.లలో)

కూరగాయలు	రైతుబజార్‌లో	బయట
టమాట	40	80
సన్నమిర్చి	60	80
దొడ్డు మిర్చి	60	80
కాకరకాయ	50	70
దొండకాయ	40	60
క్యారెట్	50	80
బీర్నిస్	70	90
గోరు చిక్కుడు	50	70
పాపిడి చిక్కుడు	50	80
చామగడ్డ	40	70
క్యాప్సికం	60	80
బెండకాయ	40	70
వంకాయ	40	60
క్యాబేజీ	30	50

దొంగతనం నిందతో వ్యక్తి ఆత్మహత్య

రాఖీ పండుగకు అత్తారింటికి వచ్చి బలవన్మరణం


మల్లం లింగం

చేర్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : తాను చేయని దొంగతనం నిందను మోపి అవమానపరిచారన్న మనోవేదనతో ఒక వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చేర్యాల మండలం కొత్తదొమ్మాట గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబీకులు, స్థానికుల కథనం మేరకు.. కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన మల్లం బాలలక్ష్మి ఇంట్లో దొంగతనం జరిగింది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు విచారణ చేపట్టారు. బాలలక్ష్మి ఇల్లు మల్లం లింగం (48) వ్యవసాయబావి దారిలో ఉండడంతో, అతనిపై అనుమానం వ్యక్తం చేయగా పోలీసులు లింగాన్ని విచారించారు. దీంతో స్థానికులు తన పట్ల వ్యవహరించిన తీరు, పోలీసుల విచారణతో మల్లం లింగం మనోవేదనకు గురయ్యాడు. శనివారం రాఖీ పండుగ సందర్భంగా తన భార్యతో కలిసి కొత్తదొమ్మాట గ్రామంలోని అత్తవారింటికి వచ్చాడు. కుటుంబసభ్యులతో సంతోషంగా గడిపిన లింగం, ఆదివారం తెల్లవారుజామున ఇంటి ఆవరణలోని గది దూలానికి తువ్వాలుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఇది గమనించిన కుటుంబసభ్యులు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. లింగం భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. చేర్యాల మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

మైనంపల్లి వ్యవహారంతోనే కాంగ్రెస్‌కు రాజీనామా

- తల్లి పేరు పెట్టి అసభ్యకరంగా దూషించాడు
- ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌గౌడ్ మండిపాటు

7

'నులి'పేస్తేనే ఆరోగ్యం

నేడు 1-19 వయస్సు వారికి నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

7

ఆర్టీసీ ప్రత్యేక బాదుడు

టికెట్‌పై 50 శాతం అదనంగా వసూలు



దానంపల్లిలో ఘనంగా బీరప్ప బోనాలు

చేర్యాల మండలం దానంపల్లిలో గొల్ల, కురుమ కులస్థులు ఆదివారం బీరప్ప బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనం తయారు చేసి డిల్లెంబల్లెం చప్పుళ్ల నడుమ గ్రామంలో ఊరేగింపు నిర్వహించి బీరప్ప ఆలయానికి చేరుకున్నారు. సంప్రదాయబద్ధంగా బోనం నివేదించి తమ పాడిపంటలు చల్లగా కాపాడాలని వేడుకున్నారు.

- చేర్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి)



మహిళా కార్యకర్తలతో సెల్ఫీ దిగుతున్న హరీశ్‌రావు

మళ్లీ కేసీఆర్ కావాలి అధికారంలోకి రావాలి

- ప్రజలు కోరుకుంటున్నారు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలు మళ్లీ కేసీఆర్ కావాలని, మరోసారి అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలు అసంతృప్తితో ఉన్నారన్నారు. సిద్దిపేట పట్టణంలోని 20వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంను శనివారం హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల గుండెల్లో నిలిచేది గులాబీ జెండాయే అని తెలిపారు. ప్రతీ వార్డులో పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసి కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మహ్మమద్ ఇంతియాజ్, అజిమోద్దీన్, రెహాన్, ఆరిఫ్, మోహిన్, సల్మాన్, నవాజ్, ఖాజా పాషా, రహీంలకు పార్టీ కండువా కప్పి హరీశ్‌రావు పార్టీలోకి ఆహ్వానించారు.

సిద్దిపేట పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో అమర్‌నాథ్ సేవా సమితి సభ్యులను ఎమ్మెల్యే హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్సీ పారూక్‌హుస్సేన్ సన్మానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ అమర్‌నాథ్‌లో 14వ సారి 35రోజుల పాటు భక్తులకు సేవ కార్యక్రమాలు చేసినందుకు అభినందనలు తెలిపారు. సిద్దిపేట హరిప్రియనగర్ అభయ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారిని ఎమ్మెల్యే హరీశ్‌రావు దర్శించుకున్నారు

చదువుతో పాటు క్రీడల్లో పోటీ పడాలి

చదువుతో పాటు క్రీడల్లో కూడా పోటి పడాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. క్రీడల్లో రాణించే క్రీడాకారులకు తన సంపూర్ణ సహకారం ప్రోత్సాహం ఉంటుందన్నారు. హనుమకొండ, జనగామలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలో వివిధ అంశాల్లో జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు పతకాలు సాధించారు. చాంపియన్‌షిప్‌లో రాణించిన జిల్లా క్రీడాకారులను క్యాంపు కార్యాలయంలో ఆయన సన్మానించారు.


అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి సభ్యులను సన్మానిస్తున్న హరీశ్‌రావు

పీహెచ్‌సీ రికార్డు నిర్వహణపై అసంతృప్తి

- అహ్మదీపూర్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



అహ్మదీపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ హైమావతి

గజ్వేల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డుల నిర్వహణపై కలెక్టర్ హైమావతి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి ఆమె అహ్మదీపూర్ పీహెచ్‌సీతో పాటు గజ్వేల్ పట్టణంలోని మైనార్టీ బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించిన కలెక్టర్.. హాజరు పట్టిక (అటెండెన్స్ రిజిస్టర్), ఓపీ రిజిస్టర్, మందుల రిజిస్టర్లను తనిఖీ చేశారు. రిజిస్టర్లలోని రోగుల సంఖ్య, మందుల వివరాలు సరిపోవడం లేదని ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని, సీజనల్ వ్యాధుల విషయంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం మైనార్టీ బాలుర పాఠశాలలో భోజన ప్రక్రియను పరిశీలించి, కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. నాణ్యమైన ఆహార పదార్థాలు వాడుతూ రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని, వంట గది, పరిసర ప్రాంతాలు ఎప్పుడూ శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడిన ఆమె.. చదువుతో పాటు ఆటలపై కూడా దృష్టి పెట్టాలని, పోషకాహారం ఎక్కువగా తీసుకోవాలని, ముఖ్యంగా సిరిధాన్యాల ఆహారం తప్పనిసరిగా తినాలని సూచించారు. గురుకులంలో ఏవైనా సమస్యలుంటే ప్రాధాన్యత ప్రకారం పరిష్కరిస్తామని, ఉన్నత లక్ష్యంతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆమె విద్యార్థులను ప్రోత్సహించారు.

12న బేస్ బాల్ జట్ల ఎంపికలు

వర్గల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 12న సిద్దిపేట జిల్లా సీనియర్ స్త్రీ, పురుషుల బేస్ బాల్ జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నిమ్మ రంగారెడ్డి ఆదివారం తెలిపారు. వర్గల్ మండలం నెంటూర్ విశ్వశాంతి విద్యా నికేతన్ హైస్కూల్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డుతో ఆరోజు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9848949152, 9391213799, 9989409804 నంబర్ల ద్వారా సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో బేస్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మధు యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



చందాపూర్ గ్రామంలో వరినారు తీస్తున్న ఆంధ్రా కూలీలు

వరి నాటుకు ఆంధ్రా కూలీలు

● ఇక్కడ కూలీల కొరతే కారణం ● ఖర్చు ఆదా

తొగుట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో వరి నాట్లు వేయడానికి కూలీల కొరత తీవ్రంగా ఉంది. దీంతోపాటు కూలీ రేట్లు కూడా రోజుకు రూ.600 వరకు పెరగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర ప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతం నుంచి వచ్చిన కూలీలపై రైతులు ఆధారపడుతున్నారు. ఆంధ్రా కూలీలు ఎకరాకు రూ.6000 తీసుకుని నారు తీయడం, నాటు వేయడం వంటి పనులను త్వరగా పూర్తి చేస్తున్నారు. ఇక్కడి కూలీలతో వరి నాటు వేస్తే ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.9 వేల వరకు రైతులకు ఖర్చు వస్తుంది. అదే ఆంధ్ర కూలీలతో పని చేయిస్తే రైతులకు ఎకరాకు దాదాపు రూ.2వేల నుంచి 3వేల వరకు ఆదా అవుతోంది. తొగుట, మిరుదొడ్డి, కొండపాక, గజ్వేల్, సిద్దిపేట రూరల్, దౌల్తాబాద్, రాయపోల్, దుబ్బాక వంటి మండలాల్లో రైతులు ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారు.



చందాపూర్ గ్రామంలో వరినాటు వేస్తున్న ఆంధ్రా కూలీలు

పని త్వరగా పూర్తవుతుంది..



కూలీల కొరత, అధిక రేట్ల కారణంగానే ఆంధ్రా కూలీలను రప్పించాం. వారివల్ల పని త్వరగా పూర్తవుతువ్వడంతో కొంత ఖర్చు కూడా ఆదా అవుతుంది. గత రెండేళ్లుగా బీహారు కూలీలతో నాటు వేయించగా ఈసారీ ఆంధ్రకూలీలతో నాటు వేయిస్తున్నా.

- సిరిసిల్ల భాస్కర్, చందాపూర్



విద్యారత్న పురస్కారాన్ని అందుకుంటున్న ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ

రామకృష్ణకు జాతీయ స్థాయి పురస్కారం

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నిజాంపూర్(కె)ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డా.పోట్రు రామకృష్ణకు జాతీయ స్థాయి విద్యారత్న పురస్కారం దక్కింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేసి పురస్కారాలు అందజేశారు. ఇందులో భాగంగా హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ జాతీయ అధ్యక్షుడు కొంపల్లి సత్యానారాయణ, స్వర్ణగిరి ఆలయ వ్యవస్థాపకుడు మానెపల్లి రామారావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్ చేతుల మీదుగా రామకృష్ణ జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. విద్యా, సామాజిక రంగంలో చేసిన విశేష సేవలకు రామకృష్ణకు ఈ పురస్కారం వరించింది. ఈ కార్యక్రమంలో హెచ్ఎం టీవీ జోర్దార్ రాములు, సహాయ నటుడు సమ్మయ్య పాల్గొన్నారు. కాగా విద్యారత్నపురస్కారం అందుకున్న రామకృష్ణను ఎంఈవో శంకర్, కాంప్లెక్స్ హెచ్ఎం రాజశ్రీ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.

జాతీయ యోగా పోటీలకు ఎంపిక



ఎంపికైన యోగాసాధకులు, మెడల్స్ సాధించిన క్రీడాకారులు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ యోగా పోటీలకు సిద్దిపేట జిల్లా నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. అదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో సీనియర్ పురుషుల (45 నుంచి 55 ఇయర్స్) విభాగంలో ట్రెడిషనల్ అండ్ బ్యాలెన్స్ అంశాల్లో సిద్దిపేటకు చెందిన సురేష్ యాదవ్, సీనియర్ మహిళా విభాగంలో బ్యాక్ బెండింగ్ అంశంలో టీ.కవితారావు, సంపత్‌కుమార్, సీనియర్-బి మహిళా విభాగంలో ట్విస్టింగ్ అంశంలో జైన సంధ్య, బ్యాక్ బెండింగ్ అంశంలో ఎం.నర్మద అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. అలాగే సీనియర్-ఏ విభాగంలో హ్యాండ్ బ్యాలెన్స్ లో శ్రీప్రసన్న, ఫార్వర్డ్ బెండింగ్‌లో బత్తిని సంధ్య, ట్రెడిషనల్ ఈవెంట్లో మనీషా ఉత్తమ ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించారు. జాతీయ యోగాసనా పోటీలకు ఎంపికైనవారు తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ విషయమై సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ జాయింట్ సెక్రటరీ, యోగా శిక్షకుడు తోట సతీష్, వ్యాస మహర్షి యోగా సొసైటీ చైర్మన్ డాక్టర్ అరవింద్, యోగా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

మైనంపల్లి వ్యవహారం వల్లే కాంగ్రెస్‌కు రాజీనామా

● తల్లి పేరు పెట్టి అసభ్యకరంగా దూషించాడు

● సిద్దిపేటకు హనుమంతరావుకు సంబంధమేమిటి?

● ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌గౌడ్ మండిపాటు

సిద్దిపేట ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట కాంగ్రెస్ పార్టీలో మైనంపల్లి హనుమంతరావు వ్యవహరిస్తున్న శైలి వల్లే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్, ఆ పార్టీ నాయకుడు గాదగోని చక్రధర్‌గౌడ్ మండిపడ్డారు. ఆదివారం సిద్దిపేటలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మైనంపల్లి హనుమంతరావుపై విరుచుకుపడ్డారు. ఈ మేరకు ఆదివారం తన రాజీనామాను ఆమోదించాలని కోరుతూ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు లేఖ రాశారు. సిద్దిపేటకు ఎలాంటి సంబంధం లేని మైనంపల్లి సిద్దిపేటలో పెత్తనం చేలాయించాలని చూస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సిద్దిపేటలో భూకబ్జాలకు పాల్పడిన వారిని పార్టీలోకి తీసుకొని, ల్యాండ్ మాఫియా, రౌడీ షీటర్లకు మద్దతు పలుకుతూ, నిజమైన కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీస్తున్నారని మండిపడ్డారు. పార్టీ కోసం కష్టపడుతున్న తనను తల్లి పేరు పెట్టి అసభ్యకరమై పదజాలంతో పది మందిలో తిట్టడం తనను తీవ్రంగా కలిచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనతో తిరిగే కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ పోలీసు కేసులు, రౌడీ షీట్లు పెడుతూ వేధిస్తున్నాడని ఆరోపించారు. మైనంపల్లిపై కాంగ్రెస్ అధిష్టానం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఇంతకాలం తనను ఆదరించిన సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, సిద్దిపేట కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మైనం పల్లి హనుమంతరావు వ్యవహార శైలి వల్ల ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. అధిష్టానం మైనంపల్లిపై చర్యలు తీసుకోకపోతే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి భంగపాటు తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పడం బూటకమేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతి, శ్రీకాంత్, అశ్వాక్, శివ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చక్రధర్‌గౌడ్

రైస్ మిల్లులో చోరీ

● రూ. 4లక్షలు అపహరణ

కొల్చారం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రంగంపేటలోని రైస్ మిల్లులో శనివారం రాత్రి చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ముప్పిడి కృష్ణ కు చెందిన రైస్ మిల్లు తాళాన్ని దుండగులు పగులగొట్టి లోనికి ప్రవేశించి కార్యాలయంలోని పెట్టెలో ఉన్న రూ.4లక్షల నగదును దోచుకెళ్లారు. ఆదివారం ఉదయం యజమాని రైస్ మిల్ వద్దకు వెళ్లేసరికి కార్యాలయ తాళం పగలగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ మొయినుద్దీన్ ఘటనా స్థలానికి వచ్చి వివరాలను సేకరించారు. అలాగే శనివారం రాత్రి రాంపూర్ దుర్గామాత ఆలయ తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించగా ఏమి దొరక్క వస్తువులను చిందరవందర చేసి వెళ్లిపోయారు

వైన్స్‌లో రూ.24వేలు..

చిలప్‌చెడ్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని జగ్గంపేట గ్రామంలోని వైన్స్‌లో ఆదివారం చోరీ చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం జగ్గంపేట-సిరిపురం(గేట్) గ్రామ శివారులోని ఎస్‌వీఆర్ వైన్స్‌లో తెల్లవారు జామున 3 గంటల సమయంలో గుర్తు తెలియని దుండగుడు ద్విచక్ర వాహనం పై వచ్చి వైన్స్ షెటర్‌ను గడ్డపార సహాయంతో పైకి లేపి లోపలికి ప్రవేశించాడు. ముఖానికి మాస్క్, చేతులకు గ్లౌజులు, తలకు హెల్మెట్ పెట్టుకుని వచ్చిన అతడు, సీసీ టీవీ వైరును తొలగించి లోపలికి ప్రవేశించినట్లు ఫుటేజీలో రికార్డు అయ్యింది. గల్లా పెట్టెలోని రూ.24 వేల నగదును అపహరించాడని వైన్స్ నిర్వాహకుడు రమేష్ తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నర్సింహులు పేర్కొన్నారు.

'నులి'పేస్తేనే ఆరోగ్యం

● నేడు 1-19 వయస్సుగలవారికి నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

కొండపాక, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా, సోమవారం నుంచి 'జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం'ను పురస్కరించుకుని డివార్మింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నది. ఈ సందర్భంగా 1 నుంచి 19 సంవత్సరాల వయసుగల వారికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ మాత్రలు అందుబాటులోఉంటాయి. సోమవారం తీసుకోని వారికి ఆగస్టు 18న తిరిగి మాత్రలు అందిస్తారు.





వయసును బట్టి డోస్

1 నుంచి 2 సంవత్సరాల పిల్లలకు 400 ఎంజీలో సగం అంటే 200 ఎంజీ మాత్రను, మిగతా వారికి 400 ఎంజీ పూర్తి మాత్రను ఇవ్వాలి. మాత్రను బాగా నమిలి మింగాలి. అల్పాహారం లేదా భోజనం తర్వాతే ఈ మాత్రలను తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఖాళీ కడుపుతో ఉన్నవారికి ఎట్టి పరిస్థితిల్లో ఇవ్వరాదని తెలిపారు.

నులిపురుగుల వ్యాప్తి ఇలా..

పరిసరాల అపరిశుభ్రత, చేతులను శుభ్రం చేసుకోకపోవడం, బహిరంగ మలవిసర్జన, శుభ్రం చేయని నీరు తాగడం వల్ల నులిపురుగులు వ్యాపిస్తాయి. వీటి వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి, విరోచనాలు వంటి సమస్యలు వస్తాయి. నులిపురుగుల నిర్మూలన వల్ల రక్తహీనత తగ్గి, పోషకాల శోషణ మెరుగుపడుతుంది. తల్లిదండ్రులు దీన్ని గమనించి పిల్లలకు మాత్రలు ఇప్పించాలి.

బోధకాలు నిర్మూలనే లక్ష్యం

● సంగారెడ్డి జిల్లా వైద్యాధికారి నాగనిర్మల

అమీన్‌పూర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బోధకాలు, నులిపురుగుల నివారణకు ఇంటింటికీ మందుల పంపిణీ చేస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగనిర్మల పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆనంద్‌నగర్‌లో మందుల పంపిణీ శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. 1నుంచి 19సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వైద్యారోగ్య సిబ్బంది పంపిణీ చేస్తారన్నారు. వ్యాధుల నుంచి పిల్లలను కాపాడుకునేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారంనర్సింహగౌడ్, మాజీ కౌన్సిలర్లు బాశెట్టికృష్ణ, యూనుస్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రవీన్, భానూర్ పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ దీప్తి, వెద్యాధికారి డాక్టర్ జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆనంద్‌నగర్ కాలనీలో బోధకాలు, నులిపురుగుల మాత్రల పంపిణీ ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

ఆర్టీసీ ప్రత్యేక బాదుడు

● టికెట్‌పై 50 శాతం అదనంగా వసూలు

జహీరాబాద్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పండుగలు, పెళ్లిలు, తదితర సీజన్‌లొస్తే చాలు ఆర్టీసీ ప్రయాణికులపై అదనపు భారం మోపుతూనే ఉన్నది. ప్రత్యేక బస్సుల పేరిట ఒక్కో టికెట్‌పై 50% అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం జహీరాబాద్ డిపో మీదుగా హైదరాబాద్, లింగంపల్లి, బీదర్ రూట్లలో 12 అదనపు ట్రిప్పులను నడుపుతున్నారు. సాధారణంగా బీదర్-హైదరాబాద్‌కు టికెట్ ధర రూ.220 ఉండగా, సీజన్‌లలో రూ.320 వసూలు చేస్తున్నారు. ఇక జహీరాబాద్-హైదరాబాద్ రూ.180కి గాను రూ.300, జహీరాబాద్-బీదర్ రూ.60కి గాను రూ.90, జహీరాబాద్-సంగారెడ్డి రూ.100కు గాను రూ.150, బీదర్‌నుంచి లింగంపల్లి వరకు రూ.190-250, జహీరాబాబాద్-సదాశివపేట రూ.90కి గాను రూ.120 ప్రయాణికుల నుంచి వసూలు చేస్తున్నారు. ఇక్కడే కాకుండా ఉమ్మడి మెదక్‌జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ అధికారులు ప్రత్యేకం పేరిట వసూలు చేస్తున్నారని ప్రయాణికులు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.



సదాశివపేట నుంచి జహీరాబాద్ వరకు రూ.120 టికెట్



వర్గల్ : నాచగిరి క్షేత్రంలో మూలవిరాట్ లక్ష్మీనృసింహస్వామి



వర్గల్ : నాచగిరి క్షేత్రంలో భక్తులు



కొమురవెల్లి : మల్లన్న నిత్య కల్యాణంలో భక్తులు

భక్తజనసంద్రం

కొమురవెల్లి/ఝరాసంగం/వర్గల్/ పాపన్నపేట, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి):శ్రావణమాసం ఆదివారం సందర్భంగా కొమురవెల్లి మల్లికార్జునస్వామి సన్నిధిలో భక్తులు కోలాహలం కనిపించింది. గంగిరేణి చెట్టు వద్ద, ఆలయ ముఖ మండపంలో పట్నాలు వేసి బోనాలు చెల్లించారు. ముఖ మండపంలో స్వామివారి నిత్య కల్యాణంలో పాల్గొన్నారు. కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. అమృతగుండంలో స్నానాలు ఆచరించి స్వామి దర్శనం కోసం క్యూలో బారులు తీరారు. స్వామి దర్శనం కోసం భక్తులకు రెండు గంటల సమయం పట్టింది. నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో సామూహిక సత్యనారయణ స్వామి వ్రతాలు, నిజాభిషేకాలు, నిత్యకల్యాణాలు నిర్వహించారు. ఏడుపాయల వనదుర్గామాత ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది.బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు.



పాపన్నపేట: మూలవిరాట్ వనదుర్గామాత



పాపన్నపేట : అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ఝరాసంగం : కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో

ఆదమరిస్తే అంతే..!

రాజీవ్ రహదారి పక్కనే ప్రమాదకరంగా గుంత



ములుగులో రాజీవ్ రహదారి పక్కన ప్రమాదకర గుంత

ములుగు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ - కరీంనగర్ హైవే రోడ్డుపై అతిపెద్ద గుంత పడి ప్రమాదకరంగా మారినా అధికారులు పట్టించుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. ములుగు మండల కేంద్రం రాజీవ్ రహదారిపై నర్సంపల్లి మూలమలుపుపై అతిపెద్ద గుంత పడింది. కొంతకాలంగా గుంత పక్కన స్టాపర్ పెట్టి వదిలేశారు. వాహనదారుల పాలిట ప్రమాదకరంగా మారినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఆ మూల మలుపు మీద ఎన్నో ప్రమాదాలు జరిగినప్పటికీ అధికారులకు చీమకుట్టినట్టయినా లేదు. వెంటనే సంబంధిత అధికారులు పట్టించుకొని గుంత పూడ్చేయాలని, లేదా దానిపై స్లాబ్ వేసి ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.





దుబ్బాక నుంచి బల్వంతాపూర్, చింతమడక రహదారిపై పలుచోట్ల గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

ఈ రహదారి పనులకు మోక్షమెన్నడో?

- నాలుగేళ్ల క్రితమే బల్వంతాపూర్ గ్రామ శివారులో కల్వర్టు, నిర్మాణానికి సుమారు రూ.2.63 కోట్లు మంజూరు
- నేటికీ ప్రారంభం కాని పనులు
- రాకపోకలకు తప్పని ఇబ్బందులు



కల్వర్టు లేక బల్వంతాపూర్- చింతమడక రహదారిపై పారుతున్న వరదనీరు

దుబ్బాక, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఈ రహదారిని గత ప్రభుత్వంలో దుబ్బాక నుంచి కేసీఆర్ స్వగ్రామమైన చింతమడక గుండా ఇబ్రహీంపూర్ వరకు మంజూరు చేశారు. సుమారు రోడ్డుభవనాల శాఖ ప్లాన్ వర్క్ కింద రూ.18 కోట్లతో నాలుగు లైన్ల రహదారిని మంజూరు చేశారు. సుమారు 22 కిలోమీటర్ల రహదారి పూర్తిగా చేపట్టినప్పటికీ, బల్వంతాపూర్ ప్రారంభంలో, గ్రామం శివారులో కల్వర్టు, సిమెంట్ రహదారి వేయడానికి సుమారు రూ.2.63 కోట్లను నాలుగేళ్ల క్రితం మంజూరు చేశారు. ప్లాన్‌వర్క్ నిధుల్లో మిగిలిన నిధులను మళ్లించి, వీటిని మంజూరు చేశారు. ఈ పనులకు టెండర్ పూర్తయి, కాంట్రాక్టర్ అగ్రిమెంట్ కూడా పూర్తయ్యింది. అయితే నాలుగేళ్లుగా పనులను మాత్రం ప్రారంభించడంలేదు. మాజీ సీఎం కేసీఆర్ బాల్యంలో ఇదే రహదారిపై సైకిల్‌పై వచ్చి, దుబ్బాకలో ప్రాథమికోన్నత విద్యను అభ్యసించారు. ఆయన స్వగ్రామానికి వెళ్లే రహదారి పనులు మొత్తం పూర్తయినప్పటికీ, చేయకుండా మిగిలిన ఈ పనుల వల్ల చినుకు పడితే, బురదగుంటగా మారి, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పూర్తిగా బురదమయమైన రహదారిని బాగుచేసేందుకు ఆర్అండ్‌బీ అధికారులు మిగిలిపోయిన కల్వర్టు, సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కేంద్రమంత్రిని కలిసిన బీజేపీ నాయకులు



కేంద్రమంత్రి బండి సంజయ్‌తో కోహెడ మండల బీజేపీ నాయకులు

కోహెడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను మండల బీజేపీ నాయకులు ఆదివారం కరీంనగర్ కేంద్రంలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కోహెడ మండల అభివృద్ధికి పలు సమస్యల పరిష్కారానికి మరిన్ని నిధులు కేటాయించాలని కోరినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఖమ్మం వెంకటేశం, నాయకులు నేముల వికాస్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు ఖమ్మం సతీష్, ఓబీసీమోర్చా మండల అధ్యక్షుడు కక్కర్ల దామోదర్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ బోలుమల్ల ఆంజనేయులు తదితరులున్నారు.

దశలవారీగా మున్సిపల్ అభివృద్ధి



నర్సారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆయా వార్డుల నాయకులు

గజ్వేల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): దశలవారీగా మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తామని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎస్సీ సెల్ నాయకుడు షైన విజయ్ ఇంట్లో అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా ఆయనను 9, 10వ వార్డులకు చెందిన పలువురు కలసి పటేల్‌బజార్ నుంచి రామాలయం వెళ్లే దారిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ అంతర్గత రోడ్లను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. వెంట గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, నాయకులు నబ్బని నరేశ్, మోహన్నగారి రాజు, అజహర్, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్, బాగనోళ్ల మోహన్, కన్నాయాదవ్, శివరాంరెడ్డి, చెప్యాల శేఖర్, గుండు లక్ష్మణ్, నక్క రాములు, భైరం రమేశ్ తదితరులున్నారు.

న్యూస్ బాక్స్

బీఎంఎస్ సిద్దిపేట జిల్లా నూతన కమిటీ ఎన్నిక

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి):భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) సిద్దిపేట జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చామకూర రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా ముద్ద రాజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా చంద్రమౌళి, భూపాల్ యాదవ్, శ్రీనివాస చారి, సహాయ కార్యదర్శులుగా మల్లేశం, కవిత, రాజు, బి శ్రీనివాస్, సంఘటన కార్యదర్శిగా ఉమేష్ గౌడ్, కోశాధికారిగా కొండల్ రెడ్డి, కార్యాలయ కార్యదర్శిగా యాదగిరి, సభ్యులుగా రవి, ప్రవీణ్, రాజవ్వ, సత్యనారాయణ లతో కమిటీని ఎనుకున్నట్లు కార్యదర్శి రాజిరెడ్డి తెలిపారు.

పుస్తె మట్టెలు అందజేత



వధువు కుటుంబ సభ్యులకు కూర రఘోత్తం రెడ్డి తరఫున పుస్తె మట్టెలు అందజేస్తున్న ప్రవీణ్

చిన్నకోడూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఓ పేదింటి వధువు వివాహానికి మాజీ శాసన మండలి సభ్యులు కూర రఘోత్తం రెడ్డి పుస్తె మట్టెలు బహుకరించారు. చిన్నకోడూరు మండలం గోనెపల్లికి చెందిన బొగ్గుల బాలవ్వ కుమార్తె తేజస్విని వివాహానికి ఆదివారం మాజీ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి పుస్తె మట్టెలు పంపించగా గ్రామానికి చెందిన ప్రవీణ్ వధువు కుటుంబ సభ్యులకు అందజేశాడు.

బీసీ సింహగర్జనను విజయవంతం చేయాలి



మోతెలో మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

మిరుదొడ్డి, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న దుబ్బాకలోని రజనీకాంత్‌రెడ్డి పంక్షన్‌లో బీసీ సింహగర్జనను విజయవంతం చేయాలని దుబ్బాక పీఏసీఎస్ చైర్మన్ కైలాస్ పిలుపునిచ్చారు. ఆదివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో బీసీ నాయకులతో కలిసి బీసీ సింహగర్జనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు వంజరి శ్రీనివాస్, డాక్టర్ కృష్ణ, బోయశ్రీనివాస్, స్వామి, కుమార్, మల్లేశం, స్వామి తదితరులున్నారు.

బీసీ రిజర్వేషన్లను కేంద్రం ఆమోదించాలి



సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఎం నాయకుల నిరసన

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్లో చట్టం చేయాలని సిద్దిపేట జిల్లా సీపీఎం కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్లపై బిజెపి ద్వంద వైఖరిని అనుసరిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి 42 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలస్వామి, శశిధర్, ఎల్లయ్య, భాస్కర్, నవీన, ప్రశాంత్, రంగారెడ్డి, శోభ, సంజయ్, రవీందర్ రెడ్డి, అభిషేక్ భాను, భాస్కర్ పాల్గొన్నారు.

ద్వంద్వ వైఖరిని మానుకోవాలి

మిరుదొడ్డి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై కేంద్రప్రభుత్వం ద్వంద్వవైఖరిని మానుకోవాలని సీపీఎం నాయకులు ఎల్లం,శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. ఆదివారం 42శాతం బీసీ రిజర్వేషన్ల అమలుపై కేంద్రం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ అక్బర్‌పేట-భూంపల్లి చౌరస్తాలో సీపీఎం నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై చేసిన తీర్మానానికి కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు పెట్టి అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు స్వామి, కుమారస్వామి, అభి, దాసు తదితరులున్నారు.



అక్బర్‌పేటలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి



గజ్వేల్‌లో మాట్లాడుతున్న ఏడీఏ బాబునాయక్

గజ్వేల్/వర్గల్/మద్దూరు, ఆగస్టు 10: ప్రతీ రైతు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని గజ్వేల్ వ్యవసాయాశాఖ ఏడీ ఎల్.బాబునాయక్ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ఐవోసీలో గల వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ 18 నుంచి 59సంవత్సరాల మధ్య వయస్సు గల రైతులు ఆగస్టు 13లోగా వ్యవసాయ విస్తరణ అధికారిని కలసి రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 5వ తేదీ వరకు పట్టాదారు పాసుపుస్తకం వచ్చిన రైతులు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతు బీమా దరఖాస్తు, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్సు, నామిని ఆధార్‌కార్డు జిరాక్సు ఏఈవోలకు అందజేయాలన్నారు. ఇదివరకు దరఖాస్తు చేసుకున్నవారు మరోసారి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. గజ్వేల్ డివిజన్ పరిధిలోని కుకునూరుపల్లి, కొండపాక, రాయపోల్, గజ్వేల్ మండలాల పరిధిలోని ఆయా రైతు వేదికల్లో రైతుబీమా దరఖాస్తులను అందజేయాలన్నారు. అదేవిధంగా వర్గల్ మండల వ్యవసాయాధికారి శేషశయన, మద్దూరు మండల వ్యవసాయాధికారి బి. రామకృష్ణ ఆదివారం వేర్వేరుగా మాట్లాడుతూ.. ఆయా మండలాల్లోని రైతులు ఈ నెల 13వ తేదీ లోగా రైతు బీమా కోసం సంబంధిత ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుకు జతచేసి రైతు వేదికలోని వ్యవసాయ విస్తరణాధికారులకు అందజేయాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యేను అరెస్ట్ చేయాలి



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

గజ్వేల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకుడు కొమ్ము విజయ్‌ను కులం పేరుతో దూషించిన మాజీ ఎమ్మెల్యేను అరెస్ట్ చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు దళిత సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఆదివారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు పొన్నాల కుమార్‌లతో కలసి విజయ్ కుమార్ వెంకటయ్యను ఆయన నివాసంలో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ... తన ఎదుగుదలను చూసి ఓర్వలేక తనపై నర్సారెడ్డి దాడి చేశారన్నారు. ఇందుకు స్పందించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య స్పందించి పోలీస్ కమిషనర్, గజ్వేల్ ఏసీపీలకు ఫోన్ చేసి విజయ్‌పై దాడిని గూర్చి ఆరా తీశారు. మాజీ ఎమ్మెల్యేపై నమోదైన అట్రాసిటీ కేసు విచారణను వేగవంతం చేసి, చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారితో ఎమ్మార్పీఎస్ నాయకులు ముంద్రాతి కృష్ణ, పోసాన్‌పల్లి రాజు, దుబాషి సంజీవ్ తదితరులున్నారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా..



ఖాజీపూర్‌లో మృతుడి కుటుంబానికి డిపాజిట్ బాండ్‌ను అందజేస్తున్న స్నేహితులు

మిరుదొడ్డి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): చిన్ననాటి స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన పూర్వ విద్యార్థులు స్నేహం విలువను చాటిచెప్పారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి రాజు అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందాడు. అతడితో పాటే చదువుకున్న 2000-01 బ్యాచ్ ఎస్సెస్సీ పూర్వ విద్యార్థులు ఆదివారం రాజు కుటుంబాన్ని పరామర్శించారు. రూ.25వేలను స్నేహితుడి కూతురైన సాత్విక పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో తోటి స్నేహితులు రమేష్, రాజనర్సింహారెడ్డి, హైమ్మద్, చంద్రశేఖర్, మమత, అరుణ, గోదాదేవి తదితరులున్నారు.

దుబ్బాకలో ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం



దుబ్బాకలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

దుబ్బాక, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): దళితమంత్రులంటే దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డికి మర్యాద లేదా అంటూ కూడవెళ్లి రామలింగేశ్వరాలయ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి, దుబ్బాక కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు కొంగరి రవి, దుబ్బాక మున్సిపాలిటీ అధ్యక్షుడు ఏసురెడ్డిలు మండిపడ్డారు. ఆదివారం దుబ్బాక బస్టాండ్ వద్ద కాంగ్రెపార్టీ నాయకులతో కలిసి దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి రాష్ట్ర మంత్రులు దామోదర్‌రాజనర్సింహ్మా, వివేక్‌లపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిరంతరం ప్రజాభివృద్ధి కోసం పాటుపడే మంత్రులపై కొత్తప్రభాకర్ రెడ్డి రెడ్డి అహంకారపూరితంగా అనుచిత వ్యాఖ్యలను చేయడంపై తీవ్రంగా మండిపడ్డారు. దుబ్బాక ఎమ్మెల్యే తక్షణమే మంత్రులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదా ఎమ్మెల్యేను గ్రామాల్లో అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు మచ్చశ్రీనివాస్, గుండాశంకర్, కాల్వనరేష్, భరత్, సలీం, ప్రసాద్ ఉన్నారు.

పీఆర్టీయూ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్‌గా లక్ష్మినారాయణ



లక్ష్మినారాయణకు నియామకపత్రాన్ని అందజేస్తున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

సిద్దిపేట రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పీఆర్టీయూ తెలంగాణ స్టేట్ సిద్దిపేట జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నీరడి లక్ష్మినారాయణను నియమించినట్లు పీఆర్టీయూ టీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, ఆధారాసుపల్లి శశిధర్‌శర్మ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి, నారాయణరావుపేట మండలశాఖ అధ్యక్షుడు ఎర్రవెల్లి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పన్యాల శ్రీనివాస్ రెడ్డి, నజీమ్ బాబా, సీనియర్ నాయకులు మట్ట మల్లారెడ్డి ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి లక్ష్మినారాయణకు అభినందనలు తెలిపారు.

వాకర్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటకు చెందిన జైశ్రీరామ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక బాలికల పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 26 యూనిట్ల రక్తాన్ని ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ వారు సేకరించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జిన్నారంలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

జిన్నారం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గడ్డపోతారం మున్సిపాలిటీ మంత్రికుంటలో నిర్మించిన నల్లపోచమ్మ ఆలయ ఉత్సవాలు, విగ్రహ ప్రతిష్ఠాపన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. అలాగే మాజీ జడ్పీటీసీలు బాల్‌రెడ్డి, దేవానందం, నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశంగౌడ్, ప్రకాశంచారి, సురేందర్ గౌడ్, రాజేష్, బాశెట్టి రాజు, ఆంజనేయులు, జనార్ధన్, శ్రీనివాస్ రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మాసాయిపేటలో మహంకాళీ జాతర

మాసాయిపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మాసాయిపేటలో ఆదివారం మహంకాళీ అమ్మవారి జాతర ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా తొలిరోజున గ్రామంలో మహిళలు బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు. జాతరకు 30 గ్రామాల నుంచి ప్రజలు హాజరవుతారు.

పటాన్‌చెరులో నల్లపోచమ్మకు బోనాలు

పటాన్‌చెరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు డివిజన్ పరిధి బండ్లగూడ మార్క్సనగర్ కాలనీలో నల్లపోచమ్మ ఆలయంలో ఆదివారం బోనాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మహిళలు బోనాలు ఎత్తుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, నాగమల్లేయాదవ్ తదితరులు ఉన్నారు.

ఐదుగుళ్ల పోచమ్మ బోనాలు

రామచంద్రాపురం టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : అలాగే రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్ ఐదుగుళ్ల పోచమ్మ బోనాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. ఇందులో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కార్పొరేటర్ పుష్పానగేష్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, భారతీనగర్ కార్పొరేటర్ సింధూ ఆదర్శరెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్యయాదవ్ అమ్మవారిని దర్శించుకున్నారు.

పేదలకు వరం సీఎం సహాయ నిధి



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ జ్యోతి స్వామి

గజ్వేల్ రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామానికి చెందిన పలువురికి సీఎం సహాయనిధి కింద ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మేరకు మంజూరైన చెక్కులను మాజీ ఎంపీటీసీ గొడుగు జ్యోతి స్వామి లబ్ధిదారులకు అందజేశారు. గొడుగు కలవ్వ రూ.60వేలు, వెంకటేష్ రూ.24వేలు, అంజనేయులకు రూ.22,500, స్వామికి రూ.15,500 చెక్కులను పంపిణీ చేశారు. నరేష్‌గౌడ్, ప్రభాకర్, పురం అంజనేయులుకు రూ.22,500, స్వామికి 15,500 చెక్కులనుఅందజేశారు. ఈ కార్యక్రమంలో నరేష్ గౌడ్, ప్రభాకర్, పురం అంజనేయులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

చేగుంటలో ఘనంగా నల్లపోచమ్మ జాతర



చేగుంటలో బోనాలతో మహిళల ఊరేగింపు

చేగుంట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండల కేంద్రంలో మాదిగ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నల్లపోచమ్మ అమ్మవారికి బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అయిత పరంజ్యోతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో. డప్పు చంద్రయ్య, బక్క చిన్న నరసింహులు, ఎర్ర నాగులు, కుర్ర ఆగమయ్య పాల్గొన్నారు.

కూరో మొర్రో

(5వ పేజీ తరువాయి)

మితిమీరిపోయాయి. రూ.20కి మూడు సన్నని కట్టలే ఇస్తున్నారు. ఈ నెల మొదటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. దీంతో వివిధ రకాల కూరగాయ పంటల కోత ఆలస్యమవుతుండగా, కొంత దెబ్బతిన్నాయి. దీంతో రైతు బజార్లు మొదలుకుని వీధి వ్యాపారుల వరకు అన్నిచోట్ల ధరలు భగ్గుమంటున్నాయి.

బహిరంగ మార్కెట్‌లో డబుల్ ధరలు

తమ రెక్కల కష్టంతో రైతులు పండించిన కూరగాయలను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు, నేరుగా వినియోగదారులకు విక్రయించుకునేందుకు, దళారుల మధ్యవర్తిత్వం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం లక్షల రూపాయల నిధులు వెచ్చించి వారి కోసం రైతుబజార్‌ను ఏర్పాటు చేసింది. కానీ రైతుబజార్‌లో దళారులు రాజ్యమేలుతున్నారు. కొందరు రైతుబజార్‌కు తీసుకొచ్చిన పంటను లోపలికి వెళ్లగానే దళారులు అడ్డుపడి, రోజంతా ఏం కూర్చొని అమ్ముతావంటూ, రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. వాటిని బహిరంగ మార్కెట్‌లో రైతుబజార్ ధరల కంటే డబుల్ ధరలకు ప్రజలకు విక్రయిస్తున్నారు. దీనివల్ల అటు రైతులు, వినియోగదారుల జేబులకు చిల్లులు పడుతుంటే దళారీలు మాత్రం జేబులు నింపుకుంటున్నారు.

బోర్డుపై ఒక ధర... అమ్మేది మరొక ధర

సిద్దిపేట పట్టణంలోని రైతుబజార్‌కు ప్రతీ రోజు పలు గ్రామాల నుంచి వచ్చే రైతులు కూరగాయలను విక్రయిస్తుంటారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు కిలో చొప్పున ధర సూచించేలా రైతుబజార్ అధికారులు పట్టికపై సూచిస్తారు. సూచించిన మేరకు మాత్రమే కూరగాయలను రైతులు విక్రయించాల్సి ఉంటుంది. కానీ అందుకు భిన్నంగా కొంతమంది సూచించిన ధర కంటే కిలోకు రూ.5 నుంచి రూ.10 వరకు ఎక్కువగా తీసుకుంటున్నారు. ఇదేంటని వినియోగదారులు అడిగితే 'తీసుకుంటే తీసుకోండి.. లేకుంటే లేదు' అనే సమాధానం వస్తుంది. దీంతో ప్రజలు చేసేది లేక చెప్పిన ధరకు కొనుగోలు చేయక తప్పడం లేదు. మరికొంత మంది వినియోగదారులు రైతుబజార్ అధికారుల దృష్టికి తీసుకెళ్తే, అప్పుడే స్పందిస్తున్న రైతు మళ్లీ షరామామూలే అన్నట్లుగా విక్రయిస్తున్నారు.